క్లుప్తంగా

అంగన్‌వాడీ పోస్టులకు ఇంటర్వ్యూలు



గురజాల: అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాల పోస్టులకు గురువారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలు సజావుగా ముగిసాయి. గురజాల ఐసీడీఎస్ ప్రాజెక్టులో అంగన్‌వాడీ టీచర్, హెల్పర్లు ఇద్దరు, పిడుగురాళ్ల ప్రాజెక్టులో హెల్పర్లు 11 మంది, మాచర్ల ప్రాజెక్టు పరిధిలో అంగన్‌వాడీ వర్కర్లు 8మంది, మిని వర్కర్ ఒకరు లెక్కన పోస్టుల భర్తీకి అభ్యర్థుల ధృవీకరణ పత్రాలు పరిశీలించారు. 40 పోస్టులకు గాను 80 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఐసీడీఎస్ పీడీ ఉమాదేవి, ఆర్డీఓ మురళీకృష్ణ, ఇన్‌చార్జి సీడీపీవోలు అరుణ, అనురాధ, లీలావతి పాల్గొన్నారు.

పాలువాయి సెంటర్‌లో చలివేంద్రం



పాలువాయి(రెంటచింతల): పాలువాయి గ్రామంలోని ప్రధాన సెంటర్లో పాలువాయి సొసైటీ ఆధ్వర్యంలో సొసైటీ పర్సన్ సీహెచ్ స్వరూప గురువారం సొసైటీ ఏర్పాటు చేసిన చలివేంద్రం ప్రారంభించారు. కూలీలకు, రైతులకు, గ్రామస్తులకు దాహార్తి తీర్చడానికి వేసవి ముగిసే 60 రోజుల పాటు ఈ చలివేంద్ర ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. సీఈఓ తుమ్మా సాగర్ రాజశేఖర్‌రెడ్డి, ఏజీఎం బాలకృష్ణారెడ్డి, చీఫ్ మేనేజర్ కె. కరుణాకర్‌బాబు, మేనేజర్ డి.బలరామిరెడ్డి, సూపర్ వైజర్ టి.చిన్న అంజిరెడ్డి పాల్గొన్నారు.

ఉపాధి పథకం టీఏగా భాస్కర్ నాయక్



రెంటచింతల: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం టెక్నికల్ అసిస్టెంట్‌గా భాస్కర్ నాయక్ గురువారం విధుల్లో చేరినట్లు ఎంపీడీఓ కె. సరోజినిదేవి తెలిపారు. ఇక్కడ టెక్నికల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న విజయకుమారి దుర్గి మండలానికి, అక్కడ పనిచేస్తున్న భాస్కర్ నాయక్‌ను రెంటచింతలకు బదిలీ చేస్తూ జిల్లా ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

షిర్డి సాయిబాబాకు ప్రత్యేక పూజలు



పాలువాయి జంక్షన్(రెంటచింతల): మండలంలోని పాలువాయి జంక్షన్‌వద్ద ఉన్న షిర్డి సాయిబాబా మందిరంలో గురువారం దేవస్థానం ప్రధాన అర్చకులు గోపాల్ పాండే ఆధ్వర్యంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తమ మొక్కులు చెల్లించుకున్నారు. భజన బృందం బాబా గీతాలను ఆలపించగా భక్తులు తన్మయం చెందారు. చైర్మన్ పందిరి శ్రీనివాసరావు భక్తులకు అన్న సంతర్పణ చేసి, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

సాయి బాబాకు పూజలు



మాచర్ల: పట్టణంలోని పత్తి ఫ్యాక్టరీ ఆవరణంలోని సాయిబాబా దేవాలయంలో గురువారం ఆలయ కమిటీ అర్చకుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి అర్చన కార్యక్రమంతో పాటు అభిషేకాలు నిర్వహించి, హారతి ఇచ్చారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఉచిత కోచింగ్ సెంటర్ ప్రారంభం

మాచర్ల: పట్టణంలో రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో శ్రీశైలం రోడ్డులోని స్వామి వివేకానంద ఆశ్రమంలో గురువారం నిర్వాహకుడు మెట్టు గోవిందరెడ్డి ఆధ్వర్యంలో ఉచిత పాలిటెక్నిక్, ఏపీఆర్‌జేసీ కోచింగ్ సెంటర్లను జూలకంటి గౌతమ్‌రెడ్డి, అక్కిరెడ్డి ప్రారంభించారు. సమితి ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీషుతోపాటు, పలు కోర్సుల్లో ఉచితంగా శిక్షణ అందించడం అభినందనీయమన్నారు.

ఆధార్ ప్రత్యేక క్యాంపులు ప్రారంభం

మాచర్ల: పట్టణంలో పూర్ణయ్య షెడ్డు బజారు, సెరిన్ కాలనీ సచివాలయం, అంగన్‌వాడీ కేంద్రం తదితర ప్రాంతాల్లో మున్సిపల్ కమిషనర్ డి.వేణుబాబు ప్రత్యేక ఆధార్ కేంద్రాలు గురువారం ప్రారంభించారు. శనివారం వరకు ఆరేళ్ల లోపు చిన్నారులకు ఆధార్ నమోదు కోసం ప్రత్యేక ఆధార్ క్యాంపును ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వేలిముద్రలు పడని చిన్నారుల తల్లిదండ్రులు, ఆధార్ అప్డేట్ చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్వో సాంబశివరావు, ఆర్ఐ రంగయ్య, ఏఈ గౌతమి, అధికారులు పాల్గొన్నారు.

అర్ధంతరంగా ఆగిన అభివృద్ధి



వెల్దుర్తి జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిలిచిన భవన నిర్మాణం

వెల్దుర్తి: కూటమి ప్రభుత్వం ఏర్పడడంతోనే గత ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు ఎక్కడికక్క అర్ధంతరంగా నిలిచిపోయాయి. అందుకు ప్రత్యక్ష నిదర్శనం మనబడి నాడు–నేడు కింద పాఠశాలల్లో రెండవ విడతలో చేపట్టిన అదనపు తరగతి గదుల నిర్మాణం. మండల కేంద్రమైన వెల్దుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ.1.08 కోట్లతో నాలుగు అదనపు తరగతి గదుల నిర్మాణాన్ని చేపట్టారు. ప్రస్తుత ప్రభుత్వంలో బిల్లులు సక్రమంగా రాకపోవడంతో పనులు నిలిపివేశారు. కస్తూర్బాగాంధీ బాలికోన్నత పాఠశాలలో రూ.96 లక్షలతో చేపట్టిన అదనపు తరగతి గదుల నిర్మాణాలు మధ్యలోనే నిలిచిపోయాయి. విద్యార్థులకు సౌకర్యంగా ఉండే గదుల నిర్మాణ పనులు మధ్యలోనే ఆగిపోవడంతో అవి శిథిలావస్థకు చేరుకున్నాయి. మూడేళ్ల కిందట నాడు– నేడు ద్వారా అధునాతన బిల్డింగ్‌లను నిర్మించాలని నిధులు మంజూరు కావడంతో అధికారులు అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను చేపట్టారు. లెంటల్ లెవల్ వరకు పనులు జరిగాయి. బిల్లులు సక్రమంగా రాకపోవడంతో ఈ పనులను కాంట్రాక్టర్లు నిలిపివేశారు. ఈ గదుల నిర్మాణాలు పూర్తయితే విద్యార్థులకు ఎంతో సౌకర్యంగా ఉంటుంది. పాఠశాల ఆవరణలో ఉన్న నిర్మాణాలు శిథిలావస్థకు చేరుకొని, చెట్లు పెరగటంతో విషపురుగులు తిరుగుతాయని విద్యార్థులు భయపడుతున్నారు. పాఠశాలలో విద్యార్థులకు సరిపడా గదులు లేకపోవడంతో ఈ గదుల నిర్మాణాలు పూర్తయితే.. కొంత మంది విద్యార్థులకు విద్యాబోధన చేసే అవకాశం ఉంటుంది. కేజీబీవీ విద్యాలయంలో నిర్మాణ దశలో ఉన్న అదనపు గదులు పూర్తయితే.. విద్యార్థినులకు ఎంతో సౌకర్యంగా ఉంటుంది. ఈ విషయంపై ఏఈ రమావత్ బాలు నాయక్‌ను వివరణ అడగగా నిధులు సక్రమంగా రాకపోవడంతో పనులు నిలిచిపోయాయన్నారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే పనులు చేపట్టి పూర్తి చేస్తామన్నారు.

మాచర్ల నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కార్యవర్గ సభ్యులు వీరే



నరసరావుపేట: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గంలోని రెంటచింతల, దుర్గి, మాచర్ల మండలాల పార్టీ కమిటీల కార్యవర్గ సభ్యులను నియమిస్తూ కేంద్ర పార్టీ కార్యాలయం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది.

మాచర్ల మండల కమిటీ కార్యవర్గం

అధ్యక్షుడిగా కొండా శివలింగరాజు, ఉపాధ్యక్షులుగా బోయ వీరారెడ్డి, పుత్తా బ్రహ్మయ్య, ప్రధాన కార్యదర్శులుగా దొడ్డా చిన్నపెద్దిరాజు, మట్టా వెంకటేశ్వర్లు, దొండేటి సాంబశివారెడ్డి, తంగిరాల రామిరెడ్డి, కార్యదర్శులుగా నేనావత్ కేలానాయక్, కంబాల చినవెంకయ్య, కొప్పుల హనిమిరెడ్డి, కరే ముసలయ్య, ఈదర నేరంద్రరెడ్డి, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా కాసిబోయిన వెంకయ్య, పండరబోయిన సత్యనారాయణ, మహంకాళి శివప్రసాదు, కొర్రా శ్రీనూనాయక్, మేకల శ్రీనివాసరావు, టేకులపల్లి రంగయ్య, వడితే మకత్‌లాల్, బూడిద పండయ్య, కేతావత్ రఘునాయక్, మట్టపల్లె బ్రహ్మమ్, కరన్ తోత్ చినినాయక్, మిర్యాల బక్కయ్య, రామావత్ గబ్బర్‌సింగ్‌నాయక్, చీరబోయిన సైదులు, మోసు వెంకయ్య, బాణావత్ స్వామినాయక్, గుర్రం సాగర్‌బాబు, అర్వపల్లి కొండయ్య, బాణావత్ లచ్చూనాయక్, పత్రా ప్రేమ్‌సాగర్‌లను నియమించారు.

రెంటచింతల మండల కార్యవర్గం

అధ్యక్షుడిగా గొట్టం చినబ్రహ్మారెడ్డి, ఉపాధ్యక్షులుగా పత్తిపాటి పిచ్చిరెడ్డి, యారసాని రాఘవరెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా మెలిక హనుమంతరావు, గుదే వెంకటరెడ్డి, సోము శివారెడ్డి, ఉమ్మా రామసైదా రెడ్డి, కార్యదర్శులుగా పులి కోటిరెడ్డి, బొడ్డపాటి లక్ష్మారెడ్డి, మర్రిరాజు, శ్యామల శ్రీనివాసరెడ్డి, మామిడి క్రిస్టియన్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా ముక్కాల మర్రెడ్డి, తిక్కా వెంకటేశ్వర్లు, గొట్టం లక్ష్మరెడ్డి, నవులూరి అశోక్‌రెడ్డి, భీమవరపు సాయి కుమార్, షేక్ షరీఫ్, వడితే మణికంఠ నాయక్, త్రిపుర నాగేశ్వరరావు, పల్లెర్ల శివారెడ్డి, ఒప్పిచర్ల శ్రీనివాసరావు, మల్లెం నరసింహారావులను నియమించారు.

దుర్గి మండలం..

అధ్యక్షుడిగా ఉన్నం వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులుగా తాళ్ల అంబారావు, మాదాసు భీష్మయ్య, ప్రధాన కార్యదర్శులుగా కొల్లి హనుమయ్య, చాట్ల రమేష్, పాశం సాంబశివరావు, కవలవాయి సాంబశివరావు, కార్యదర్శులుగా కొత్త వర్లారెడ్డి, ఉప్పు శ్రీను, షేక్ రహంతుల్లా, వడితే భీముడునాయక్, గోపిదేశి శ్రీనివాసరావు, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా రాచకొండ గోవర్ధన్, చలంచర్ల సంధ్యారాణి, బీర్నీడి కిరణ్మయి, ముఢావత్ మల్లీభాయ్, తాళ్ల నాగలక్ష్మి, రేవళ్లి పుష్పాంబ, కోట కృష్ణకుమారి, బత్తుల మునగరాజు, మిరియాల కోటేశ్వరరావు, మాచర్ల దానయ్య, పల్లె శ్రీలత, బుచ్చిరెడ్డి శౌరిరెడ్డి, నాగెళ్ల చెంచారావు, మమ్ము వెంకటేశ్వర్లు, దాంతల బుద్దయ్యలను నియమించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మాచర్ల: పట్టణంలోని శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ మాచర్ల టౌన్ అసిస్టెంట్ ఇంజినీర్ కోటేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని చెన్నకేశవస్వామి, కన్యకాపరమేశ్వరి ఆలయాల ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు మార్పు, లేన్ల మరమ్మతుల నిమిత్తం ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రీరామ నవమి ఉత్సవాలు



మాచర్ల: పట్టణంలో కోదండ రామాలయంలో నాల్గవ రోజు గురువారం ముందస్తు శ్రీరామనవమి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అర్చకులు వేణుగోపాలచారి, ఆలయ అధ్యక్షుడు బి.రామారావు ఆధ్వర్యంలో స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి, పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, మహిళా భక్తులు పాల్గొన్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

కృత్రిమ రోబోటిక్ చేతులకు రిజిస్ట్రేషన్

పిడుగురాళ్ల: దివ్యాంగులకు ఉచిత రోబోటిక్ కృత్రిమ చేతుల పంపిణీ కార్యక్రమం మే 11న చేపట్టనున్నట్లు రోటరీ క్లబ్ ఆఫ్ పిడుగురాళ్ల లైమ్ సిటీ ప్రోగ్రాం కన్వీనర్ కోటా రమేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దివ్యాంగులు మోచేతి కింద కనీసం నాలుగు అంగులాల చెయ్యి కలిగిన దివ్యాంగులు ముందస్తు రిజిస్ట్రేషన్ చేసుకున్నవారికి ఈ రోబోటిక్ కృత్రిమ చేతుల పంపిణీ చేస్తామన్నారు. ముందస్తు రిజిస్ట్రేషన్ల కోసం 98853 46845, 98484 20549 నంబర్లకు సంప్రదించాలని తెలిపారు.

రేషన్ పంపిణీ

మాచర్ల: పట్టణంలోని 31 రేషన్ షాపులు, 11 (ఎండీయూ) సంచార వాహనాల ద్వారా ఇంటింటికీ బియ్యం పథకంలో భాగంగా మూడు రోజులుగా పట్టణంలో తహసీల్దార్ కిరణ్‌కుమార్, డీటీ బత్తుల వాణి ఆధ్వర్యంలో ముమ్మరంగా రేషన్ పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ నెల బియ్యం, పంచదార మాత్రమే పంపిణీ చేస్తున్నారు. కందిపప్పు ప్రస్తావన ఎక్కడా లేదు.

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ట మహోత్సవం

బెల్లంకొండ: మండలంలోని పులిచింతల ప్రాజెక్టు ముంపు గ్రామమైన కేతవరం గ్రామంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గురువారం ధ్వజస్తంభ, పరివార దేవతల విగ్రహ ప్రతిష్టా మహోత్సవ కార్యక్రమం వైభవంగా జరిగింది. ఉదయం నుంచి వేద పండితులు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. కొండ దిగువ నగల ఆలయం వద్ద ధ్వజస్తంభాన్ని వేద మంత్రోచ్ఛారణల నడుమ ప్రతిష్ఠించారు. ఈ ప్రతిష్టా కార్యక్రమంలో జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై, పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన వితరణ కార్యక్రమాన్ని ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాటు చేశారు. ప్రతిష్టా కార్యక్రమంలో గుంటూరు మిర్చియార్డ్ మాజీ చైర్మన్ వెన్నా సాంబశివారెడ్డి, రిటైర్డ్ తహసీల్దార్ పి.భాస్కరరావు, దేవదాయ శాఖ ఈవో అవుదూరి వెంకటేశ్వరరెడ్డి, ఆలయ కమిటీ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ పాశం నరసింహారెడ్డి, ఈమని వెంకటరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులు ప్రారంభం



జెండా ఊపి ఆర్టీసీ బస్సులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

పిడుగురాళ్ల: పట్టణంలోని డిపో నుంచి ఆర్‌టీసీ బస్సులను గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు గరువారం ప్రారంభించారు. పిడుగురాళ్ల నుంచి విజయవాడకు ఎక్స్‌ప్రెస్ బస్సును, పిడుగురాళ్ల నుంచి మాచవరం మండలంలోని పిన్నెల్లి గ్రామానికి పల్లె వెలుగు బస్సును జెండా ఊపి ఎమ్మెల్యే ప్రారంభించారు. ప్రయాణికుల సౌకర్యార్థం నూతన బస్సులను ప్రారంభించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డిపో మేనేజర్ వెంకటేశ్వరనాయక్, నాయకులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



ప్రయాణికులకు నీరు అందిస్తున్న సిబ్బంది

విజయపురిసౌత్: స్థానిక ఫిల్టర్ హౌస్ వద్ద ఇరిగేషన్ శాఖ సూపరింటెండెంట్ మీసాల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో గురువారం ఉచిత చలి వేంద్రాన్ని ఏర్పాటు చేశారు. స్థానిక టీడీపీ అధ్యక్షుడు బొల్లా వెంకటేశ్వర్లు చౌదరి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం బొల్లా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వేసవి కాలం దృష్ట్యా ప్రజల సౌకర్యార్థం చలి వేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. టీడీపీ నాయకులు బొబ్బిలి చంద్రశేఖర్, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు ఊరే మార్క్, కట్టారాజు, రాంచంద్, జయరావు, స్వరూప్ కుమార్, శ్రీను పాల్గొన్నారు.

ప్రజలకు న్యాయ సేవలు అందించాలి

ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కె.నరేంద్రరెడ్డి



మాట్లాడుతున్న జడ్జి కె.నరేంద్రరెడ్డి

చిలకలూరిపేట: పారా లీగల్ వలంటీర్లు న్యాయస్థానానికి, ప్రజలకు మధ్య వారధులుగా పనిచేస్తూ, ప్రజలకు న్యాయసేవలు అందించాలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కె.నరేంద్రరెడ్డి చెప్పారు. మండల సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రాంగణంలో గురువారం పారా లీగల్ వలంటీర్లకు శిక్షణ శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న న్యాయమూర్తి నరేంద్రరెడ్డి మాట్లాడుతూ ప్రజలకు న్యాయ సేవలు చేయాలన్న సంకల్పం పారా లీగల్ వలంటీర్లు కలిగి ఉండాలని తెలిపారు. సమాజంలోని నిరుపేదలకు, అట్టడుగు వర్గాల వారికి న్యాయసేవలు అందించటంలో కీలక పాత్ర వహించాలన్నారు. లాభాపేక్ష లేకుండా ప్రజలకు సేవ చేయాలన్న ధృఢ చిత్తం కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్‌లుగా న్యాయవాదులు పి.వెంకటేశ్వరరావు, జీవీహెచ్ఎస్ ప్రసాద్, టి.రామాంజనేయులు, ఎం.భానుప్రసాద్, వై.శ్రీనివాసరావు పాల్గొని వివిధ చట్టాలపై వలంటీర్లకు అవగాహన కల్పించారు.

వేల్పూరు విద్యుత్ సబ్‌స్టేషను ప్రారంభం



సబ్ స్టేషను ప్రారంభిస్తున్న డీఈఈ రాంబొట్ల

శావల్యాపురం: మండలంలోని వేల్పూరు గ్రామంలో 33/11 కె.వి.సామర్థ్యం కల్గిన విద్యుత్ సబ్‌స్టేషను విద్యుత్ అధికారుల సారథ్యంలో గురువారం ప్రారంభోత్సవం చేసినట్లు మండల విద్యుత్ శాఖాధికారి జవ్వాజి నటరాజ్ తెలిపారు. ఈసందర్భంగా నరసరావుపేట డివిజన్ విద్యుత్‌శాఖాధికారి డీఈఈ సి.హెచ్.రాంబొట్ల పాల్గొని మాట్లాడుతూ వేల్పూరు, గంటావారిపాలెం, వెలమవారిపాలెం, ఇర్లపాడు గ్రామాలకు నిరంతరం ఈసబ్‌స్టేషను నుంచి త్రీఫేస్ విద్యుత్ సరఫరాను వినియోగదారులకు అందజేస్తామన్నారు. శావల్యాపురం నుంచి ఇర్లపాడు గ్రామం వరకు వ్యవసాయ విద్యుత్ నిమిత్తం లైను పనులు త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. అలాగే నూతనంగా ప్రారంభమైన విద్యుత్ సబ్‌స్టేషను టెస్టింగ్ కోసం ప్రత్యేకంగా విద్యుత్ సిబ్బంది పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు. వేల్పూరు విద్యుత్ సబ్ స్టేషను పరిధిలోని గ్రామాలకు చెందిన వినియోగదారులు విద్యుత్‌కు అంతరాయం వాటిల్లితే సెల్‌నంబరు 9281034240 సంప్రదించాలన్నారు. ఈకార్యక్రమంలో విద్యుత్ అధికారులు రామసుబ్బారావు, ఏడీఏ భవనం వెంకటేశ్వరరెడ్డి, ఎన్.ఏడుకొండలు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

వెల్దుర్తి: మండల ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు జరుగుతుందని ఎంపీడీఓ డి.ప్రసాద్ గురువారం ఒక తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సమావేశంలో వైద్య, ఆరోగ్యం, ఎన్ఆర్ఈజీఎస్, ప్రభుత్వ శాఖల పనితీరు తాగునీటి సమస్యలపై సమీక్ష నిర్వహిస్తామన్నారు. ప్రజా ప్రతినిదులు మండల స్థాయి అధికారులు హాజరు కావాలని పేర్కొన్నారు.

సమయానుకూలంగా బస్సు సర్వీసులు నడపాలి

వెల్దుర్తి: మండలంలోని కొత్తపుల్లారెడ్డి గూడేనికి పల్లె వెలుగు బస్సులు సమయ పాలన లేకుండా నడపడంతో గ్రామీణ ప్రయాణికులు ఇబ్బందులుపడుతున్నారు. గతంలో ప్రతి రోజూ ఐదు బస్సులు నడుపుతుండగా.. ప్రస్తుతం మూడు సర్వీసులకు పరిమితమైంది. మధ్యాహ్నం నుంచి ఆ గ్రామాలకు బస్సులు లేకపోవడంతో ప్రయాణకష్టాలు తప్పడం లేదు. ఆర్టీసీ అధికారులను బస్సులను సమయానుకూలంగా నడపాలని కోరినప్పటికీ వారు పట్టించుకోవడం లేదని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పీఆర్కేను కలిసిన గిరిజన సంఘ నాయకులు



పిన్నెల్లితో గిరిజన సంఘ నాయకులు

మాచర్ల: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గిరిజనుల సమస్యలు పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి విమర్శించారు. గురువారం గిరిజన సంఘ నాయకులు పీఆర్కేను ఆయన కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా వారి సమస్యలను పీఆర్కే దృష్టికి తీసుకొచ్చారు. ఈ విషయాన్ని వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళతామని హామీ ఇచ్చారు. పీఆర్కేను కలిసిన గిరిజన సంఘ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నూన్‌షావత్ రంగానాయక్, నియోజకవర్గ నాయకులు బాణావత్ లచ్చు నాయక్, బ్రహ్మానందపురం చిన్ని నాయక్, మేరాజ్యోతు బుల్లి పెద్దిరాజు, రవీంద్ర నాయక్ ఉన్నారు.

విజయవంతంగా 88వ సినడ్ ప్రతినిధుల మహాసభ

మాచర్ల: ఏసుక్రీస్తు సేవలో ప్రతి ఒక్కరూ పునీతులై ఉపవాస ప్రార్థనలు ముగించుకొని రాబోయే గుడ్‌ఫ్రైడే సందర్భంగా తోటి వారికి సహాయ సహకారాలందించి క్రైస్తవులంతా సేవా కార్యక్రమాలు పనిచేయాలని వెస్ట్ గుంటూరు సినడ్ బిషప్ చాట్ల ఐజయ్య అన్నారు. గురువారం వెస్ట్ గుంటూరు సినడ్ 88వ మహాసభ ప్రతినిధుల సభ మాచర్ల శివారులో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఐజయ్య మాట్లాడుతూ ఆంధ్రా యివాంజిలికల్ లూథరన్ చర్చి తరపున అనేక కార్యక్రమాలు నిర్వహిస్తూ క్రైస్తవ సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయటం అభినందనీయమన్నారు. ఏసుక్రీస్తు దీవెనలతో ప్రతి క్రైస్తవులు, ప్రతినిధులు, సంఘ పెద్దలు, సమాజ మేలు కోరుతూ ముందుకెళ్ళాలన్నారు. వెస్ట్ గుంటూరు సినడ్ పరిధిలో ప్రతినిధులు మహాసభ విజయవంతానికి కృషి చేసిన వారందరికీ ఏసుక్రీస్తు ఆశీస్సులుండాలని ఉపవాస ప్రార్ధనలో భాగంగా ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. భారీ స్థాయిలో 88 మహాసభ జరిగేలా కృషిచేసిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

ఏపీఓ వెంకటేశ్వర్లు బాధ్యతల స్వీకరణ



ఏపీఓను సన్మానిస్తున్న ఎంపీడీఓ కె.సరోజినిదేవి, ఎఫ్ఏలు

రెంటచింతల: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఏపీఓగా గంగనబోయిన చిన్న వెంకటేశ్వర్లు గురువారం బాధ్యతలు చేపట్టినట్లు ఎంపీడీఓ కె.సరోజినిదేవి తెలిపారు. డ్వామా పీడీ ఎం.సిద్దలింగమూర్తి స్థానిక ఏపీఓ జి.జయచంద్రకుమార్‌ను దాచేపల్లికి, దుర్గి ఏపీఓ జి. చిన్న వెంకటేశ్వర్లును రెంటచింతలకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. 2008 నుంచి 2010 వరకు ఇక్కడ ఏపీఓగా వెంకటేశ్వర్లు ఇక్కడ విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్థానిక ప్రజా ప్రతినిధులు, ఫీల్డ్ అసిస్టెంట్ల సహకారంతో గ్రామాల్లో జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికి ఉపాధి పనులు కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. అనంతరం ఆయనను ఎంపీడీఓ కె.సరోజినీదేవి, ఎఫ్ఏలు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీఏ భాస్కర్ నాయక్, ఫీల్డ్ అసిస్టెంట్లు ఆర్.సామ్యానాయక్, ఏడు కొండలు, ఎం.ప్రసాద్, గాలయ్య, కనకయ్య, గాలి వంశీ, మున్నారాజు, అంజయ్య, ఆనంద్, బ్రహ్మం, రమేష్ తదితరులున్నారు.

ఘనంగా కావడి ఉత్సవం



పిడుగురాళ్ల: పట్టణంలోని పిల్లుట్ల రోడ్డులో వేంచేసియున్న నాగుల గుడి దేవస్థానంలో వసంత నవరాత్రుల మహోత్సవంలో భాగంగా గురవారం శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి పల్లకి ఉత్సవం, కావడి ఉత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. షష్టిని పురస్కరించుకొని సంతాన సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి, ప్రత్యేక అలంకరణతో భక్తుల దర్శనార్థం ఉంచారు. కావటి ఉత్సవం పట్టణంలోని జానపాడు రోడ్డులో ఉన్న వాసవీ కన్యకా పరమేశ్వరి దేవస్థానం నుంచి నాగుల గుడి దేవస్థానం వరకు ఉత్సవంగా నిర్వహించారు. భక్తులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు శ్రీవెంకటేశ్వర శర్మ తీర్థప్రసాదాలను అందజేశారు.

బీఎల్వోలకు శిక్షణ కార్యక్రమం



మాట్లాడుతున్న ఆర్డీవో మురళీకృష్ణ

గురజాల : బూత్ లెవల్ ఆఫీసర్‌లు, సూపర్ వైజర్లకు గురువారం ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా రెవెన్యూ డివిజన్ అధికారి మురళీకృష్ణ పాల్గొని, ఫాం 6, 7, 8తో పాటు ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణపై తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కె.నగేష్, నగర పంచాయతీ కమిషనర్ శివన్నారాయణ, నియోజకవర్గ పరిధిలోని తహసీల్దార్లు పాల్గొన్నారు.

వైద్య సేవల సిబ్బందిని కొనసాగించాలి

- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయ నాయక్

నరసరావుపేట: గత ప్రభుత్వం 2022లో మొబైల్ అంబులేటరీ వెటర్నరీ క్లినిక్స్ ప్రాజెక్టు కింద రూ.240.69కోట్ల నిధులతో రాష్ట్ర వ్యాప్తంగా ఒక్కో నియోజకవర్గానికి రెండు చొప్పున 340 సంచార పశువైద్య ఆరోగ్య సేవా రథాలను ప్రవేశ పెట్టిన సంగతి తెలిసిందే. అయితే ఈ సంచార పశువైద్య ఆరోగ్యసేవా రథాలు జీవీకే ఈఎంఆర్ఐ సంస్థ నుంచి భవ్యకు బదలాయిస్తున్న నేపథ్యంలో పథకం ఆరంభంలో నియమించిన సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించి కనీస వేతనాలు అమలుచేయాలని సీఐటీయూ పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయనాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు కోటప్పకొండరోడ్డులోని పల్నాడు విజ్ఞాన కేంద్రంలో గురువారం అంబులెన్స్ డ్రైవర్లతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ఫేజ్–1, ఫేజ్–2లలో ఇప్పటివరకు పనిచేసిన డ్రైవర్లు, వైద్యులు, సిబ్బందిని కొనసాగించాలన్నారు. ప్రభుత్వం ప్రస్తుతం ఉన్న సిబ్బందిని తొలగించి కొత్తవారిని నియమించే ఆలోచన విరమించుకోవాలన్నారు. పనిచేసిన సిబ్బందిని ఒక సంస్థ నుంచి మరో సంస్థకు మార్పేక్రమంలో తొలగించడం ఏ మాత్రం తగదన్నారు. ఫేజ్–1 ఫిబ్రవరి 15తో ముగియగా ఫేజ్–2 ఈ నెల 5తో ముగియనున్న నేపథ్యంలో సిబ్బందిలో ఆందోళన నెలకొందన్నారు. ఫేజ్–1లో పనిచేసిన డ్రైవర్లు, వైద్య సిబ్బంది రెండు నెలల నుంచి పని, వేతనాలు లేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ నెల 15 నుంచి భవ్య ఏజెన్సీ ద్వారా పథకం సేవలు కొనసాగుతాయని ప్రభుత్వం ప్రకటిస్తూనే 165 వాహనాలను సంచార వైద్య సేవలకు, మిగిలిన 175 వాహనాలను 104 తరహాలో రోజుకో గ్రామంలో వైద్యశిబిరాలు నిర్వహించేలా మార్పు చేశారని, సిబ్బంది కొనసాగింపు విషయంలో స్పందించకపోవడం తగదన్నా రు. డ్రైవర్లు బి.గోవింద్ నాయక్, రమణ బాబు, షేక్ షరీఫ్, పద్మారెడ్డి పాల్గొన్నారు.